సాక్షి
వికారాబాద్

గురువారం ၊ 12 ၊ సెప్టెంబర్ ၊ 2024



ప్రయాణం ఎలా?

వర్షాలకు మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

8లో▸



యాలాల: కాగ్నా నదిలో వినాయకుడి నిమజ్జనం

నేడు వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్: సి.రాంచంద్రయ్య

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

తేదీ: 12 - 09 - 2024 (గురువారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:

92471 59378, 91542 99692

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

అనంతగిరి: అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీ కోసం గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సుభాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలోని వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీ విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా సదానందం



అనంతగిరి: జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా వీ సదానందం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో వికారాబాద్‌లో పశు సంవర్ధక శాఖ ఏడీగా పని చేసిన సదానందం నెల రోజుల క్రితం నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. పదోన్నతి పొంది జిల్లాకు తిరిగి వచ్చారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సార్వత్రిక విద్యా పరిషత్ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని ఎయిడెడ్ జియోన్ పాఠశాలలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. అనివార్య కారణాలతో చదువుకు దూరమైన యువతీ యువకులు, మహిళా సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయి చదువు మధ్యలోనే ఆపేసిన వారు మళ్లీ అక్షరజ్ఞానం సాధించేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఏదైనా పాఠశాల ధ్రువీకరణ పత్రంతో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చే నెల 3వ తేదీ వరకు అవకాశం ఉందని వివరించారు.



తాండూరులో గణేశ్ శోభాయాత్ర

నేత్రపర్వం.. గణేశ్ శోభాయాత్ర

తాండూరులో బుధవారం గణేశ్ శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. ఎస్పీ నారాయణరెడ్డి వేడుకలో పాల్గొని ర్యాలీని పర్యవేక్షించారు. బ్యాండ్ మేళాలు, నృత్యాలతో విగ్రహాలను ఊరేగింపుగా చెరువుల వద్దకు తరలించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వినాయకుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. – తాండూరు



పాత తాండూరు శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

టెండరు దాటని మీనం

చేప పిల్లల పంపిణీ కోసం నాలుగుసార్లు టెండర్లు

- గత బకాయిలతో ముందుకురాని కాంట్రాక్టర్లు
- వర్షాకాలం సగం గడిచినా ప్రారంభం కాని ప్రక్రియ
- ప్రైవేటుగా చేప పిల్లలు కొనుగోలు చేస్తున్న మత్స్యకారులు
- ఆర్థిక భారమని ఆవేదన



వికారాబాద్: ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వందశాతం రాయితీతో ఇచ్చే చేప పిల్లలకు అడ్డంకులు తొలగడంలేదు. సగం వర్షాకాలం గడిచినా చేపపిల్లలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నామని చెబుతున్న మత్స్య శాఖ.. పంపిణీ ప్రక్రియను మాత్రం ప్రారంభించడం లేదు. ఎంపిక చేసిన చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు జూలై మాసం నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలిచారు. కానీ ఎవరూ ముందుకు రావడం లేదు. గతేడాది టెండర్లు దక్కించుకున్న వారికి ప్రభుత్వం ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. సీజన్ ప్రారంభంలో వర్షాలు పడ్డా చెరువుల్లోకి నీరు చేరలేదు. దీంతో మత్స్యకారులు కూడా పట్టించుకోలేదు. ప్రస్తుతం చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే వాటి పెరుగుదల నామమాత్రంగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. కొందరు ఏపీ నుంచి చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో వదలుకుంటున్నారు.

అంచనాలకే పరిమితం..

జిల్లాలో ఏయే చెరువులు చేపపిల్లలు వదిలేందుకు అనుకూలంగా ఉన్నాయనే విషయాన్ని ఇప్పటికే అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జూలై 15 నుంచి 23వ తేదీ వరకు బిడ్లు వేసేందుకు గడువు ఇచ్చారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టులో చేప పిల్లల పంపిణీనీ ప్రారంభిస్తామని పేర్కొన్న ఆ శాఖ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. జిల్లాలో 1,179 చెరువులు, కుంటలు ఉన్నాయి. 746 చెరువుల్లో చేపపిల్లలు వదలాలని నిర్ణయించారు. ఈ ఏడాది 1.29 కోట్ల చేప పిల్లలు, 14.97 లక్షల రొయ్య పిల్లలు వదలాలని టార్గెట్ పెట్టుకున్నారు. జిల్లాలో 139 మత్స్య సహకార సంఘాలు, 5,142 మంది సభ్యులు ఉన్నారు. గతంలో లాగా సగం కాకుండా చెరువుల సామర్థ్యానికి సరిపడా చేప పిల్లలు పంపిణీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. దోమ మండలం పాలెపల్లి చెరువులో మత్స్యకారులు సొంత డబ్బుతో కొనుగోలు చేసిన చేప పిల్లలను వదిలారు. ప్రభుత్వం సకాలంలో చేప విత్తనం పంపిణీ చేయకపోవడంతో తాము ప్రైవేటుగా కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు.

లక్ష్యానికి దూరంగా..

చెరువుల్లో చేపపిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి వదులుతున్న వాటికి ఏ మాత్రం లెక్క సరిపోవడం లేదు. ఏటా ఇదే తంతు సాగుతోంది. ఎంచుకున్న లక్ష్యంలో 60 నుంచి 70 శాతం మాత్రమే చేపపిల్లలను వదులుతున్నారు. గతేడాది కూడా ఇలాగే జరిగింది. ఈ సారి మాత్రం చెరువులకు సరిపడా చేపపిల్లలు వదలాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి. గతంలో మాదిరి కాకుండా నాణ్యమైన చేప విత్తనం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా మూడు నుంచి నాలుగు ఇంచులు ఉన్న వాటినే చెరువుల్లో వదలాలి. కానీ ఇంచుకు మించి ఉండటం లేదు. దీంతో అనుకున్న స్థాయిలో గ్రోతింగ్ రావడం లేదని మత్స్యకారులు పేర్కొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

వర్గీకరణపై పునరాలోచన చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేత

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ కోరారు. బుధవారం ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు మరోసారి ఆలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని మెజారిటీ ఎంపీలు కోరుతున్నారని తెలిపారు. వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణ చేసే అధికారం కోర్టులకు లేదని, చట్టసభలకు మాత్రమే ఉందన్నారు. చట్టసభలు సైతం రాజ్యాంగాన్ని పరిగణలోకి తీసుకొని ఎస్సీ సామాజిక వర్గాలకు తగిన న్యాయం చేయాలన్నారు. వెనుకబడిన ఎస్సీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీలను ఇలా విడగొట్టడం సరికాదన్నారు. వారి సంక్షేమం కోసం చట్టసభల్లో చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు బీ వెంకటేష్, గాలయ్య, రాజు, యాదయ్య, ఎడ్ల సురేష్, శ్రీనివాస్, అంజిలయ్య, గోపాల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆనంద్

- తెలంగాణ ఉద్యమంలో తన పదవులను సైతం వదులుకున్నారు
- ఆయన లేనిలోటు తీర్చలేనిది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

పరిగి: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం హరీశ్వర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన చేసిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోరని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి రాష్ట్రం మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే దివంగత కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితారెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హరీశ్వర్‌రెడ్డి పరిగి నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడ్డారని గుర్తు చేశారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేశారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడుతుండే హరీశ్వర్‌రెడ్డి తన వంతుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రత్యేక రాష్ట్రం కోసం తపన పడిన మహోన్నత వ్యక్తి హరీశ్వర్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా చేసిన సేవలు గుర్తిండిపోతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న భూ బాధితులు

రెండు నాల్కల ధోరణి సరికాదు

- ఫార్మాసిటీపై సీఎం తీరుకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన
- రద్దు చేయాలంటూ నినాదాలు

యాచారం: రాష్ట్ర ప్రభుత్వం రెండు నాలుకల ధోరణిని అనుసరించడం సరైన పద్ధతి కాదని మండలంలోని ఫార్మాసిటీ భూ బాధితులు ఆరోపించారు. సీఎం ఓసారి ఫార్మాసిటీ రద్దయిందని.. మరోసారి పనులు వేగవంతం చేయాలని పేర్కొనడం దారుణమని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయాలని ఆదేశించడాన్ని ఫార్మాసిటీ భూ బాధితులు(రైతులు) వ్యతిరేకించారు. ఈ మేరకు బుధవారం నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట స్తూపం వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పెద్దలంతా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు వారే అధికారంలోకి ఉండి మళ్లీ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామనడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని చెప్పడంతో తాము కోర్టుకెళ్లామన్నారు. అందుకే మళ్లీ ఫార్మాసిటీ అంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎట్టి పరిస్థితిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయనివ్వమని శపథం పూనారు.

టీజీఐఐసీ పేరు తీసేయండి

ధరణి రికార్డుల్లోంచి టీజీఐఐసీ పేరుతో ఉన్న భూములను మళ్లీ రైతుల పేర్లపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మూడేళ్లుగా పోరాడుతున్నామన్నారు. పట్టా భూములు తమపై లేకపోవడంతో రైతుబంధు, బ్యాంకు రుణాలు, అత్యవసర పరిస్థితుల్లో క్రయ, విక్రయాలు చేద్దామంటే అవకాశమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు నారాయణ, గణేశ్, అచ్చిరెడ్డి, నిరంజన్, సత్యం, శ్రీనాథ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సార్.. స్పందించండి

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేయాలని మండలంలోని భూ బాధితులు(రైతులు) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు రాశారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆయా గ్రామాల్లో పోస్టుకార్డులపై ఫార్మాసిటీని రద్దు చేయాలని, టీజీఐఐసీ పేరు మీద మార్చిన పట్టా భూములను తిరిగి రైతులపై బదలాయించాలని అభ్యర్థించారు.



ఫార్మాసిటీని రద్దు చేయాలని సీఎం రేవంత్‌కు పోస్టుకార్డులు రాస్తున్న రైతులు


పౌష్టికాహారం తప్పనిసరి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

తుక్కుగూడ: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు అప్‌గ్రేడింగ్‌లో భాగంగా పెయింటింగ్, తాగునీరు, మురుగుదొడ్ల నిర్మాణాలు తదితర పనులు చేపడుతున్నామన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజారాణి, సీడీపీఓ శాంతిశ్రీ, తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులు మహమ్మద్ షరీఫ్, దౌలత్‌బేగంతో ట్రైనీ ఎస్‌ఐ జబీనాబేగం, కానిస్టేబుల్ అఫ్రిన్ బేగం



అమ్మానాన్న ఆంజనేయులు, చంద్రకళతో ట్రైనీ ఎస్‌ఐ ప్రణయ్‌కుమార్

కల సాకారమైన వేళ

కుల్కచర్ల మండలం మక్తావెంకటపూర్‌కు చెందిన జబీనా బేగం, పరిగి పట్టణానికి చెందిన ప్రణయ్‌కుమార్ నగరంలోని తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎస్‌ఐ ట్రైనింగ్ పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌ఐలతో బుధవారం ఉన్నతాధికారులు పరేడ్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. – కుల్కచర్ల/దోమ

క్లుప్తంగా

ఉత్సవ సమితి స్థలాన్ని అభివృద్ధి చేస్తా..

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు: తాండూరు హిందు ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన రెండు ఎకరాల భూమి అభివృద్ధికి రూ.2కోట్ల నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన హిందు ఉత్సవ సమితి స్వాగత వేదికకు ఆయన హాజరు కాగా.. నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడు రాజుగౌడ్‌ మాట్లాడుతూ.. సమితి అభివృద్ధికి గతంలో ఎమ్మెల్సీ భూమిని కేటాయించారని, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమితి అభివృద్ధికి నిధులు కేటాయించారని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. వినాయకుడి ఆశీస్సులతో ఉత్సవ సమితికి కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

యువకుడిపై కేసు నమోదు

బంట్వారం: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం కంకణాలపల్లి గ్రామానికి చెందిన రాజు.. మద్యం మత్తులో వాహనం నడిపి పట్టుబడ్డాడు. ఇందులో భాగంగా సదరు వ్యక్తిని పోలీసులు ఠాణాకు తరలించగా.. మద్యం మత్తులో ఉన్న యువకుడు.. పురుగుల మందు తాగి చనిపోతానంటూ హల్‌చల్‌ చేశాడు. ఈ మేరకు రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మంగళవారం వికారాబాద్‌ కోర్టులో హాజరు పర్చగా.. నిందితుడికి న్యాయమూర్తి 2 రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్‌ అదుపుతప్పి.. వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో సంతోష్‌

కుల్కచర్ల: బైక్‌ అదుపు తప్పి.. వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరిగూడెం మండలం ఘణపూర్‌తండాకు చెందిన సంతోష్‌ బుధవారం వ్యక్తిగత పనుల నిమిత్తం కుల్కచర్లకు వచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పటేల్‌ చెరువుతండా గేటు రోడ్డు మలుపు వద్ద బైక్‌ అదుపు సంతోష్‌ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన ప్రాంత రైతులు.. 108కి ఫోన్‌ చేశారు. స్పందన లేకపోవడంతో.. ఆటోలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి అదృశ్యం

మొయినాబాద్‌: మదర్సా నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌లోని ముస్తఫా హిల్స్‌లో ఉన్న మదర్సా మహ్మదీయ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న ఎండీ నోసల్‌(11) మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రార్థన సమయంలో స్కూల్‌ వెనకవైపు నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుధవారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దోపిడీ దొంగల రిమాండ్‌

మొయినాబాద్‌: నిర్మానుష్య ప్రాంతాలను ఎంపిక చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న దొంగలను బుధవారం మొయినాబాద్‌ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌ మండలం తొండుపల్లికి చెందిన బైండ్ల శ్రీరామ్‌, మొయినాబాద్‌ మండలం జీవన్‌గూడకు చెందిన వడ్డె నర్సింహ్మ, హిమాయత్‌నగర్‌కు చెందిన జమ్ముల సాయి, కోహీర్‌కు చెందిన నరేందర్‌ సింగ్‌ మరో ఇద్దరు మైనర్లతో కలిసి మొయినాబాద్‌, కొత్తూరు, మహేశ్వరం, కందుకూరు ప్రాంతాల్లో వాహనదారులను అడ్డగించి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 24న మొయినాబాద్‌ మండలం సురంగల్‌–కనకమామిడి రోడ్డులో ఓ వాహనాన్ని అడ్డుకుని, కళ్లల్లో కారంపొడి చల్లి రూ.1.20 లక్షల నగదు దోచుకెళ్లారు. నెల రోజుల కిందట ఇదే తరహాలో దోపిడీకి యత్నించారు. మూడు నెలల క్రితం శంషాబాద్‌లో వాహనాన్ని అడ్డగించి రూ.90 వేలు అపహరించారు. మొయినాబాద్‌లో జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు.. చాకచక్యంగా దారి దోపిడీ దొంగలను పట్టుకున్నారు. దొంగలను రిమాండ్‌కు, మైనర్లను జువైనల్‌హోమ్‌కు తరలించారు.

దారి ఇలా.. ప్రయాణం ఎలా?



నవాబుపేట ప్రధాన రహదారి దుస్థితి

- మూడేళ్లుగా కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

నవాబుపేట: అసలే వర్షాకాలం. ఆపై మట్టిరోడ్డు. గోతులు ఏర్పడి, బురదమయంగా ఉన్న రహదారితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రూ.17కోట్ల నిధులతో మూడేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డు పనులు.. నేటికీ నత్తనడక కొనసాగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

రూ.17కోట్లతో 12 కి.మీ.

నవాబుపేట మండల పరిధి బంగారు మైసమ్మ ఆలయం నుంచి మండల కేంద్రం వరకు(12 కిలో మీటర్లు) ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా 2021 డిసెంబర్‌లో మంత్రులు సబితారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా.. అనంతరం నిర్మాణ హక్కులను దక్కించుకున్న ముగ్గురు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 60 శాతం పూర్తిచేశారు.

మండల కేంద్రంలో మొదలే లేదు

ఇంత వరకు బాగానే ఉన్నా.. మండల కేంద్రంలో నేటికీ పనులు మొదలు పెట్టలేదు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్‌ మామిడి దగ్గర కిలో మీటర్‌ మేర రోడ్డును పూర్తిగా తవ్వి మట్టి పోసి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా గోతులు ఏర్పడి, బురదమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రోడ్డు దుస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. అధికారులు, నిర్మాణదారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్‌ను బెదిరించి.. లారీ అపహరణ

నిందితుల అరెస్ట్‌, రిమాండ్‌

కొత్తూరు: కొందరు యువకులు లారీని అడ్డగించారు. డ్రైవర్‌ను బెదిరించి కొంత నగదుతో పాటు.. లారీని అపహరించారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌ మండలం తొండుపల్లికి చెందిన యమ్మ శ్రీకాంత్‌(24) అత్తాపూర్‌కు చెందిన బిననోళి మురళి(19), లోకేశ్‌(19)లు స్నేహితులు. వీరు ఈ నెల 10న అర్ధరాత్రి కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌ టీ జంక్షన్‌ జాతీయ రహదారి వద్ద.. షాద్‌నగర్‌ వైపునకు వెళ్తున్న టస్కర్‌ లారీని అడ్డగించారు. డ్రైవర్‌ సర్జిత్‌సింగ్‌ను బెదిరించి అతడి వద్ద నుంచి రూ.300 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. అనంతరం అతన్ని కిందకు దించి అదే లారీతో ఉడాయించారు. వెంటనే లారీ డ్రైవర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిమ్మాపూర్‌ చౌరస్తా వద్ద రెండు బైకులపై అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా.. నేరం అంగీకరించారు. దీంతో నిందితుల నుంచి లారీ, రెండు బైకులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలి

పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్‌ ఉమామహేశ్వర్‌రెడ్డి



శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి

కడ్తాల్‌: విద్యార్థులను ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్‌ ఉమామహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో 'కౌన్సిల్‌ఫర్‌ గ్రీన్‌ రెవెల్యూషన్‌–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్‌ ఎర్త్‌ క్లబ్‌ యంగ్‌ ఎర్త్‌ లీడర్స్‌' సెకండ్‌ బ్యాచ్‌ ఓరియెంటేషన్‌ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌, నాగర్‌కర్నూల్‌, నారాయణపేట్‌ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌ఫర్‌ గ్రీన్‌ రెవెల్యూషన్‌ పర్యావరణ సంస్థ సలహాదారు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి, ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. నేల, జీవ వైవిధ్యం ప్రపంచ వ్యాప్తంగా క్షీణించి పోతుందన్నారు. ప్రకృతి సంపద వేగంగా తరిగి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. వాతావరణ మార్పులు, కాలుష్యం పెరుగుతున్నాయని, ఈ విషయంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణానికి సంబంధించి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్‌ సాయిభాస్కర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. నేల, వ్యవసాయం, ప్రకృతి మధ్య గల అవినాభావ సంబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్‌ డీఎస్‌ఓ శ్రీనివాస్‌రావు, ఐఈఎస్‌ స్పెషలిస్ట్‌ అన్నమయ్య, అడ్మిన్‌ అధికారి అనుదీప్‌, ప్రోగ్రాం ఆఫీసర్స్‌ నగేశ్‌, రజనీకాంత్‌, లక్ష్మీప్రసన్న, హరితాదేవి, సీజీఆర్‌ ప్రతినిధులు రవి కొత్తపల్లి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌రోడ్డుపై డీసీఎం బోల్తా

మూడు గంటల పాటు ట్రాఫిక్‌ జాం



క్రేన్‌తో డీసీఎంను తొలగిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: నాగార్జునసాగర్‌ రహదారిపై డీసీఎం బోల్తా పడి, మూడు గంటల పాటు ట్రాఫిక్‌ అంతరాయం కలిగింది. ఈ సంఘటన బుధవారం ఉదయం 8 గంటలకు సాగర్‌ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భారీ లోడ్‌తో కొహెడ రోడ్డు నుంచి వచ్చిన డీసీఎం.. సాగర్‌ క్రాస్‌ రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఘటనా సమయంలో వాహనంలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ.. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న పట్నం ట్రాఫిక్‌ పోలీసులు ప్రమాద స్థలికి చేరుకున్నారు. భారీ క్రేన్‌ సహాయంతో ఆరగంట పాటు శ్రమించి డీసీఎంను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు



డ్రోన్‌ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న క్రీడా డైరెక్టర్‌ డాక్టర్‌ సింగ్‌, శాస్త్రవేత్తలు

- పాత విధానాన్ని అనుసరిస్తూనే ముందుకు సాగండి
- రైతులకు సూచించిన క్రీడా, ఇస్రో అధికారులు
- గడ్డమల్లయ్యగూడలో వ్యవసాయ డ్రోన్‌ ప్రదర్శన

యాచారం: డ్రోన్ల సహకారంతో తక్కువ సమయంలో ఎరువులు, పురుగు మందులు చల్లే విధానాన్ని రైతులు వినియోగించుకోవాలని కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన(క్రీడా) సంస్థ, ఇస్రో అధికారులు సూచించారు. పాత పద్ధతుల్లోనే కాకుండా.. ఆధునిక పద్ధతుల్లో సాగు చేసి, అధిక లాభాలు పొందాలన్నారు. బుధవారం క్రీడా, ఇస్రో ఆధ్వర్యంలో గడ్డమల్లయ్యగూడ గ్రామంలో వ్యవసాయ డ్రోన్‌ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, వంగ పంటల్లో పిచికారీ చేసే విధానం, ఇస్రో తయారు చేసిన నానో యూరియా, నానో డీఏపీతో ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్రీడా డైరెక్టర్‌ డా.వీకే సింగ్‌, ప్రోగ్రాం నిర్వాహకుడు డాక్టర్‌ కె.రవిశంకర్‌, క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్‌ డాక్టర్‌ చంద్రకాంత్‌, ఇస్రో రాష్ట్ర మార్కెటింగ్‌ మేనేజర్‌ కృపాశంకర్‌ పాల్గొన్నారు. రైతులకు పలు రకాల కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. డ్రోన్‌ పనిచేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో క్రీడా శాస్త్రవేత్తలు సంజీవరెడ్డి, గోపాలకృష్ణ, తిమ్మన్న, విజయకుమార్‌, జాగృతి రోహిణీ, అన్నిదా బీవీ, ఆశిష్‌, భార్గవి, గిరిజావేణి, సిబ్బంది శ్రీకాంత్‌, సలీమ్‌, సాయికుమార్‌, సునిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్నరెడ్డి, రైతులు రామలింగారెడ్డి, సురేశ్‌రెడ్డి, అశోక్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోకుండా చూడండి

ఎంపీ మల్లురవికి కాంగ్రెస్‌ నాయకుల వినతి



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్‌ శ్రేణులు

ఆమనగల్లు: రీజినల్‌ రింగ్‌రోడ్డు దక్షిణభాగం రహదారి నిర్మాణంలో మేడిగడ్డతండా, గుడితండాల గిరిజనులు భూములు కోల్పోకుండా చూడాలని నాగర్‌కర్నూల్‌ ఎంపీ డా.మల్లు రవిని కాంగ్రెస్‌ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు రవీందర్‌నాయక్‌, మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ గుర్రం కేశవులు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలని విన్నించారు. రోడ్డు పనులకు సంబంధించి సర్వే చేశారని, మేడిగడ్డతండా, గుడితండాల మీదుగా మార్కింగ్‌ చేశారని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపడితే గిరిజన రైతులు భూములు కోల్పోతారని వెల్లడించారు. దీనికి స్పందించిన ఎంపీ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్‌



ఆమనగల్లులో స్వాధీనం చేసుకున్న టిప్పర్‌

తలకొండపల్లి: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌కుమార్‌ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మలకుంటతండా శివారు ప్రాంతంలో ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అదే విధంగా ఆమనగల్లు మండలం మేడిగడ్డకు చెందిన నేనావత్‌ దేవేందర్‌.. తన టిప్పర్‌లో హైదరాబాద్‌కు మట్టిని తరలిస్తుండగా, పోలీసులు వలపన్ని వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే.. కఠిన చర్యలతో పాటు కేసు నమోదు చేసి, జైలుకు పంపిస్తామని సీఐ హెచ్చరించారు.

ఐసీఏఆర్‌లో 14వ ర్యాంక్‌

శివను అభినందించిన గ్రామస్తులు



శివ

తలకొండపల్లి: వెంకట్రావ్‌పేట్‌ గ్రామానికి చెందిన సప్పిడి తిరుపతయ్య, ఇందిర దంపతుల కుమారుడు శివ కుమార్‌ బుధవారం ప్రకటించిన ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ ఆల్‌ ఇండియా విభాగంలో 14వ ర్యాంక్‌ సాధించాడు. గతంలో కూడా ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం అగ్రికల్చర్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో రాష్ట్ర మొదటి ర్యాంక్‌ సాధించాడు. ఈ సందర్భంగా శివను గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభినందించారు.

నేడు నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం

అనంతగిరి: వికారాబాద్‌లో నిర్వహించే వినాయక నిమజ్జన నిర్వహణ ఏర్పాట్లపై గురువారం హిందూ ఉత్సవ సమితి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి, కన్వీనర్‌ కృష్ణ పంతులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఆయా మండపాల నిర్వాహకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, యువజన సంఘాలు పాల్గొనాలన్నారు. సా. 4 గంటలకు స్థానిక శ్రీ రామమందిరంలో సమావేశం ఉంటుందన్నారు

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత

హెరిటేజ్‌ డైరీ జోనల్‌ హెడ్‌ సత్యనారాయణ

తలకొండపల్లి: హెరిటేజ్‌లో పాలు పోసే ప్రతి పాడి రైతు ఆర్థికాభివృద్ధికి చేయూత నందిస్తామని హెరిటేజ్‌ డైరీ జోనల్‌ హెడ్‌ సత్యనారాయణ, హైదరాబాద్‌ రీజియన్‌ హెడ్‌ నర్సింగ్‌ రావులు అన్నారు. మండల పరిధి వెంకటాపూర్‌లో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో పాడి రైతులు–ప్రోత్సాహకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాడి రైతు నరేష్‌ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు, స్టీల్‌ పాల క్యాన్‌లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. హెరిటేజ్‌లో పాలు పోసే ప్రతి రైతుకు ఉచితంగా రూ.2 లక్షల ప్రమాద బీమా చేయిస్తామని తెలిపారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. సబ్సిడీ ద్వారా పశుదాణా, మినరల్‌, మిక్చర్‌, నట్టల మందు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లాంట్‌ మేనేజర్‌ స్వామి గౌడ్‌, సూపర్‌వైజర్‌ కార్తీక్‌, లక్ష్మీ నారాయణ గౌడ్‌, కృష్ణయ్య, శేఖర్‌గౌడ్‌, యోగీశ్వర్‌గౌడ్‌ జంగయ్య, ప్రకాశ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి ధర్మాన్ని పాటించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: విధి నిర్వహణలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా.. వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యేను పలువురు జర్నలిస్టులు.. బుధవారం క్యాంపుకార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత్రికేయులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మానవీయ కోణంలో వార్తలను రాయాలన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా.. కృషి, పట్టుదలతో పాటు ఓపిక ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సత్యనారాయణ, శ్రీశైలం, శివకుమార్‌, రమేష్‌, శీనయ్య, శ్రీనివాస్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జర్నలిస్టులు

నేతల సన్మానం

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే శంకర్‌ను.. తన క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఇందులో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ విశ్వం, చెన్నయ్య, విజయ్‌ కుమార్‌రెడ్డి, జమృద్‌ఖాన్‌, కట్టా వెంకటేష్‌, అంజద్‌ గోరి, రఘుమారెడ్డి, అన్వర్‌, కృష్ణారెడ్డి, అలీం ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్‌

- ఆస్పత్రిలో చొరబడి హంగామా
- బలవంతంగా బయటకు పంపించిన పోలీసులు



మందుబాబుతో మాట్లాడుతున్న పోలీసు

చేవెళ్ల: మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రిలో హల్‌చల్‌ చేశాడు. బ్లేడ్‌తో గొంతుపై కోసుకొని సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చేవెళ్ల ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన కె.కృష్ణ గతంలో దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. మద్యానికి బానిసై రోడ్లపై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తొలుత కోర్టులోకి వెళ్లబోగా.. గస్తీ పోలీసులు మందలించి అక్కడి నుంచి పంపించారు. అనంతరం ఓ టీస్టాల్‌ వద్ద గొడవకు దిగాడు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో చొరబడి హంగామా చేశాడు. బ్లేడ్‌తో గొంతుపై కోసుకున్నాడు. సామగ్రిని చెల్లా చెదురుగా పడేశాడు. వైద్యం చేసేందుకు వచ్చిన సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి.. సదరు వ్యక్తికి నచ్చజెప్పి, బయటకు పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

రూ.6.63 లక్షల నగదు, 6.5 తులాల బంగారం అపహరణ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఉదయం.. సీఐ ప్రమోద్‌ కుమార్‌, ఎస్‌ఐ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నా యి. చెన్నకేశవరెడ్డి, దోమ రాంరెడ్డి, దోమ సురేషరెడ్డి, నాయిని మాధవరెడ్డిలు హైదరాబాద్‌లో నివాస ముంటున్నారు. అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. ఇది గమనించిన దొంగల ముఠా.. తాళా లు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌ చేశారు. పక్కా ప్రణా ళికతో రాత్రి వేళల్లో తాళాలను పగలగొట్టి, ఇళ్లల్లోకి చొరబడ్డారు. బీరువాలు తెరిచారు. దస్తావేజులు చిందరవందరగా పడేశారు. రూ.6,63,000 నగదుతో పాటు 6.5 తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. సందీపురెడ్డి, చెన్నకేశవరెడ్డిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న సీఐ, సిబ్బంది

పరిశ్రమల్లో శ్రమ దోపిడీ



మండల కేంద్రం సమీపంలో కొనసాగుతున్న పాతటైర్లను కాల్చే పరిశ్రమ(ఫైల్‌)

కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. రేయింబవళ్లు పరిశ్రమల్లో చెమటోడుస్తున్న కష్టజీవులు.. కనీస వేతనం పొందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. శ్రమకు తగిన ఫలితం ఇవ్వాలని సుదీర్ఘకాలంగా కార్మిక సంఘాల నాయకులు పోరాటాలు చేస్తున్నా.. వారి బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారాయి.

- కనీస వేతనం పొందని కార్మికులు
- ప్రమాదపుటంచుల్లో విధినిర్వహణ
- రక్షణ కవచాలు, కనీస సౌకర్యాలు కల్పించని యాజమాన్యాలు
- దుర్భర జీవితాన్ని గడుపుతున్న కష్టజీవులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: షాద్‌నగర్‌ నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల్లో ఒడిశా, బిహార్‌, ఉత్తరప్రదేశ్‌ తదితర రాష్ట్రాలకు చెందిన వలస జీవులు పనిచేస్తుంటారు. మధ్యవర్తిగా కొనసాగుతున్న కొందరు కాంట్రాక్టర్లు వారిని లెడ్‌ బట్టీలు, పాత టైర్లను కాల్చే కర్మాగారాల్లో పనికి కుదుర్చుతుంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పని చేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. భరించలేని దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. ఇంత చేసినా.. ఆశించిన ఫలితం లేకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు. కుటుంబ సభ్యులకు గుక్కెడు అన్నం పెడితే చాలన్న యోచనలో బతుకు బండిని లాగుతున్నారు.

పట్టించుకోని అధికారులు

నిబంధనల ప్రకారం కార్మికశాఖ (లేబర్‌ ఆఫీసర్లు) తరచుగా పరిశ్రమలను సందర్శించాలి. కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకోవాలి. పనిచేసే చోట రక్షణ పరికరాలతో పాటు.. సరైన వసతులు కల్పించని పరిశ్రమలను గుర్తించి యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలి. ఇవేమీ ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కార్మికులు శ్రమదోపిడీతో పాటు.. ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పని గంటలు పెంచి..

చట్ట ప్రకారం పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు, అంతర్రాష్ట్ర కార్మికులకు అదనపు అలవెన్సులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి చట్టాలు ఏవీ అమలు కావడం లేదన్నట్లు తెలుస్తోంది. 8 గంటలకు బదులుగా 12 గంటల పాటు పనిచేయించుకుంటూ.. ఆయా యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయి. అంతే కాదు.. పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకుని కార్మికులు గాయపడటమో, మృత్యువాత పడటమో జరుగుతున్నాయి. కానీ ఇవేవీ బయటకు పొక్కకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొత్తూరు, షాద్‌నగర్‌ ప్రాంతాల పారిశ్రామికవాడల్లో తరచుగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



రక్షణ పరికరాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులు

రూ.26 వేలు ఇవ్వాలి



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు యాజమాన్యాలు జీతం చెల్లించాలి. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. 8 గంటలు పనిచేయించాలి. కానీ ఇక్కడ అవేమీ అమలు కావడం లేదు. పని గంటలు పెంచి.. జీతాలు తక్కువగా ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలి.

– పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి